రోడ్లన్నీ ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం!

వర్షాలకు గుంతలమయమైన రోడ్లు | పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వానం | పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు | మరమ్మతు చేయడంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం




జవహర్‌నగర్, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల పరిధిలో అధ్వానంగా తయారైన రోడ్లు



సాక్షి, సిటీబ్యూరో: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగర శివారు పురపాలికలు, పంచాయతీల పరిధిలోని రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారవుతున్నాయి. లోతట్టు కాలనీలు, మురికి వాడలను వరద దాదాపు ముంచెత్తుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పలు చోట్ల డ్రైనేజీలు కాలువలు కూడా దెబ్బతిన్నాయి. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నడవలేని పరిస్థితులు నెలకొన్నాయనడం అతిశయోక్తికాదు.

- బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాల పరిధిలోని దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయంగా మారాయి.
- గతంలో భారీగా పడిన వర్షాలతో బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. డ్రైనేజీ కాలువల సహా రోడ్ల పనులకు ప్రభుత్వం రూ. 110 కోట్లు విడుదల చేసినా.. పనులు పూర్తి చేయకపోవటంతో రోడ్లు ఛిద్రంగా మారి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్డుపై ఎక్కడికక్కడ నిలిచిపోగా, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో వరద నీరు జోరుగా ప్రవహించటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి శివారుల్లోని పలు గ్రామ పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి.

చెరువుల కబ్జాతో...

- నగర శివారు చెరువు, కుంటలు, శిఖం భూములు, నాలాల స్థలాల కబ్జాల బారినపడ్డాయి. చిన్నపాటి వర్షానికే చెరువుతు కాస్తా నిండి సమీపంలోని కాలనీలు, లో తట్టు ప్రాంతాలు, రోడ్లపైకి నీరు చేరుతోంది.
- చెరువులు, నాలాల భూముల్లో అక్రమ కట్టడాలు పెరిగిపోయాయి. నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, బడంగ్‌పేట్ పురపాలక సంఘాల్లో పలు కాలనీలు, చెంగిచర్లలోని బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్ట ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించటం వల్ల సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

శివారు పురపాలక సంఘాల్లో..

- హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉన్నాయి. ఇవేకాకుండా దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పట్టణాల్లో ప్రజల ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ. 343 కోట్లు వసూలు చేస్తున్నారు. అయినా ప్రజలకు మెరుగైన వసతులు, సేవలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- శివారు ప్రాంతమైన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 168 కోట్లు వసూలవుతోంది.
- 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో కూడా పురపాలక సంఘాల ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోకపోవటంతో అభివృద్ధి కుంటుపడుతోందనే ఆవేదన సర్వత్రా వ్యక్తం అవుతోంది.



సీఎం సారూ.. రోడ్డు వేయరూ...

జవహర్‌నగర్: సీఎం సార్.. జర రోడ్లు వేయరా ప్లీజ్ అంటూ బురదమయంగా ఉన్న రోడ్లను చూసి చిన్నారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి తాతయ్యా... మా కాలనీకి వెళ్లాలంటే భయంగా ఉంది. ఎక్కడ చూసినా బురదే. పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఇక్కడ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉన్నా పట్టించుకోవడంలేదు. రేవంత్ తాతయ్యా మా కాలనీకి రోడ్లు వేయండి ప్లీజ్...' అంటూ జవహర్‌నగర్‌లోని 28వ డివిజన్ లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన విశ్వజిత్ తన మాటలతో సోషల్ మీడియా వేదికగా వేడుకున్నాడు. ఈ బుడ్డోడి మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాలి.



రోడ్లు వేయమని సీఎంను వేడుకుంటున్న చిన్నారి విశ్వజిత్

స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే హరీశ్ రావు, వైద్యులు వాణి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు రోడ్డు నెంబర్1లో క్లేయో స్కిన్ అండ్ హెయిర్, బాడీ లేజర్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మల్లు రవి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగారావు హాజరయ్యారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వాణి, డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ.. అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు నిపుణులైన వైద్య సిబ్బందిచే చికిత్సలు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నేతలు



ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ధార లక్ష్మణ్, పబ్బా మల్లేష్, గంప సత్యం, రాజు, పాసుమర్తి శ్రీనివాస్, చిన్నం సత్యం, కోటేశ్వరరావు, పచ్చిపులుసు శ్రీనివాస్, జయకృష్ణ, సంపత్, శ్రీనివాస్, భాస్కర్, బ్రహ్మయ్య, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ


ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు నరేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నరేష్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పోతుల రాజేందర్, చంద్రమోహన్ సాగర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో బొడ్రాయికి పూజలు



మూసాపేట: మూసాపేటలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా బొడ్రాయి పూజా కార్యక్రమాన్ని రేణుకా ఎల్లమ్మ అర్చకులు ఆంజనేయశర్మ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సప్పిడి శ్రీనివాసరావు, ఆకుల రవికుమార్, నోముల శంకర్, నోముల రఘు, రామారం పార్వతమ్మ గౌడ్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో అన్నపూర్ణాదేవి



శాకంబరిగా అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మరు శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం గచిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు ఆపొద్దు



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులను రానీయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వెజిటెబుల్ మార్కెట్ భవనంలోని ఈ–లైబ్రరీలో వద్ద ఆదివారం 12 మంది పేద విద్యార్థులకు రూ.2.30 లక్షల ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక మంది పేదరికం, ఆర్థిక సమస్యల కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న తమ పిల్లలను మధ్యలోనే చదువును మాన్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను విద్యలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో సంకేత్ సంస్థ ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాల నుంచి ఆర్థిక సహాయం అందిస్తుండడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బోనాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – కూకట్‌పల్లి



హెచ్‌పీ రోడ్డులో నిర్వహించిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ తదితరులు



పూజలో పాల్గొన్న బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు



శాకంబరి అలంకారం సందర్భంగా జరిగిన పూజలో పాల్గొన్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

ఒక వర్సిటీకి దాశరథి పేరు పెట్టాలి



వెంకటేశ్వరరావు

రాయదుర్గం: రాష్ట్రంలో ఏదో ఒక విశ్వవిద్యాలయానికి దాశరథి పేరు పెట్టాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆన్‌లైన్ ద్వారా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి ఆయన కరీంనగర్‌లోని భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన దాశరథి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ నిత్య పోరాట స్ఫూర్తిగా దాశరథి నిలుస్తారని, నిజాం పాలకుల చేతిలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోల్పోయి జీవచ్ఛవాల్లా బతుకుతున్న రోజుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. దాశరథి స్ఫూర్తిని గుర్తు చేసుకోవడానికి ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు కవులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డప్పుల దరువు.. శివసత్తుల పూనకాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గ అమ్మవారి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల దరువు, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, అధ్యక్షుడు అశోక్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, నిమ్మకాయల నర్సింగ్, మక్కాల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు పునాదులు వేయాలి



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వినోద్ జాదవ్

రంగారెడ్డినగర్: విద్యార్థుల బంగారు భవితకు పాఠశాలల యాజమాన్యాలు పునాదులు వేసినప్పుడే ఉన్నతులుగా ఎదుగుతారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రంగారెడ్డి నగర్‌లో బ్రైట్ ఉన్నత పాఠశాల చైర్మన్ లయన్ వినోద్ జాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రైట్ ఎడ్యుకేషనల్ సొసైటీ యూరో కిడ్స్ పాఠశాలను ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌లతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో తక్కువ ఫీజులతో మెరుగైన విద్యనందించాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లయన్ రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లయన్ బీరు ఆంజనేయులు, పాఠశాలల కరస్పాండెంట్లు గడ్డమీది బాలరాజుగౌడ్, నరసింహులుగౌడ్, యూరో కిడ్స్ పాఠశాల ఇన్‌చార్జి వికాస్ జాదవ్, బ్రైట్ పాఠశాల ఇన్‌చార్జి అయేషా బేగం, సామాజికవేత్త కోల రవీందర్, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



వివేకానందనగర్‌లో నిర్వహించిన పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

- ఉదయం నుంచి సాయిబాబా ఆలయాల్లో పూజలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు
- హాజరైన మంత్రి సీతక్క, ఎంపీ ఈటల
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భాగ్యనగర్ కాలనీలోని శ్రీ సాయి బాబా దేవాలయంలో సాయిబాబాను మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)దర్శించుకున్నారు. అదే విధంగా శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని సాయి బాబా మందిరంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాల్లో అన్నదానం కార్యక్రమం, సాయంత్రం సాయిబాబా పల్లకీ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ ఆలయంలో సాయివ్రతంలో పాల్గొన్న భక్తులు



రోడ్డు నెంబర్2లోని సాయిబాబా ఆలయం పూజలో బండి రమేష్, వెంకటేశ్వరరావు



ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్



ఎన్‌టీఆర్ నగరలో పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ

శేరిలింగంపల్లి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ సుదర్శన్‌నగర్ కాలనీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గ్రీనరీ అభివృద్ధితో కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటయ్య, సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ విష్ణు, ట్రెజరర్ సుధాకర్, జాయింట్ ట్రెజరర్ కోటేశ్వరరావు, కాలనీ వాసులు ఉపేందర్, జగదీష్, రాజేంద్రచారీ, యోగేష్, సుబ్రమణ్యం, నిర్మల్ కమార్, యోగానంద, శ్రీధర్‌రెడ్డి, అరుణ్, అర్బన్ బయోడైవర్సిటీ సూపర్‌వైజర్ గోపాల్, నాయకులు రమేష్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

మంత్రి మెప్పు కోసం అధికారుల అత్యుత్సాహం

అమీర్‌పేట: రాష్ట్ర మంత్రి మెప్పు కోసం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారన్న సమాచారంతో ఆలయ అధికారులు దర్శనాలను నిలిపివేశారు. వీఐపీ, రూ.50 దర్శనాల క్యూలైన్‌లో నిలుచున్న వారిని సైతం చాలా సేపటి వరకు లోపలకు అనుమతించలేదు. దీంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక్క వీఐపీ కోసం ఇతర భక్తులను గంటల తరబడి దర్శనాలకు అనుమతించక పోవడం ఏమిటని ఆలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.